www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 28 డిసెంబరు 2022




కౌలురైతులకు రూ.46.79 కోట్ల పంట రుణం
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ఏలూరు ప్రతినిధి: ఏలూరు జిల్లాలో 2022-23 సంవత్సరానికి సంబంధించి 57,652 సిసిఆర్‌సి కార్డుల లక్ష్యానికిగాను 43,551 కౌలుదారులు అందించామని, ఇప్పటి వరకూ రూ.46.79 కోట్ల పంటరుణాలు మంజూరయ్యాయని వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 28వ తేదీన 'కౌలు రైతులకు వ్యవసాయమేదీ..!' అంటూ 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలైన పెట్టుబడి రాయితీ, రైతుభరోసా, ధాన్యం అమ్ముకోవడం వంటివి ఇబ్బందుల్లేకుండా సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు భూయజమాని, కౌలురైతులను సమన్వయపరుస్తూ ఇరువురు పరస్పర అంగీకారానికి వచ్చేదిశగా గ్రామాల్లో రైతుల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ 'పరేషాన్'..!

- విడుదల కాని సరెండర్ లీవుల సొమ్ము
- ఏడాదికిపైగా టిఎ బిల్లులు పెండింగ్
- పండుగల అడ్వాన్స్‌లూ నిలుపుదల
- అందని జిపిఎఫ్ రుణాలు
- క్యాంప్ ఆఫీసు విధుల్లో కనీస వసతులు కరువు
- ప్రభుత్వ తీరుపై ఖాకీల్లో తీవ్ర చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎండనక, వాననక శ్రమించే పోలీసులను సైతం ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నిబంధనల ప్రకారం వారికి ఇవ్వాల్సిన సొమ్మును చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. గతంలో ఎప్పుడూ చూడని ఇలాంటి పరిణామాలపై పోలీసులు తీవ్రంగా కలత చెందుతున్నారు. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా సివిల్, ఎఆర్ విభాగాల్లో దాదాపు మూడువేల మంది వరకూ పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఆందోళనలు, ప్రజాప్రతినిధుల పర్యటనలు వంటి పలు కార్యక్రమాలతో పోలీస్ సిబ్బందికి విరామం అనేది లేకుండా పోతుంది. సెలవులతో నిమిత్తం లేకుండా పనిచేస్తారు కాబట్టి పోలీసులకు ఏడాదికి 45 సరెండర్ లీవులిస్తారు. ఈ లీవులకు సంబంధించిన సొమ్ములను జనవరి, జులై, నవంబర్‌లో పోలీసులకు జమచేస్తారు. డిసెంబర్ నెల వచ్చినప్పటికీ సరెండర్ లీవుల సొమ్ము ఇవ్వలేదని పోలీసులు గగ్గోలు పెడుతున్నారు. ఈ సొమ్ము వస్తే పిల్లల ఫీజులకు, ఇంటి ఆర్థిక అవసరాలకు ఉపయోగించుకోవచ్చని పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలుగానే మారిపోతున్నాయి. క్రిస్మస్, సంక్రాంతి పండుగకు అడ్వాన్స్‌లుగా రూ.ఆరు వేల నుంచి రూ.ఏడువేల వరకూ ఇస్తున్నారన్నారు. ఈ సొమ్ముతో పిల్లలకు పండుగ బట్టలతో ఇంట్లో పిండి వంటకాలకు ఉపయోగించుకునే పరిస్థితి ఉండేది. ఈ సొమ్మును తీసుకున్న ఉద్యోగుల నుంచి ప్రతినెలా జీతంలో కొంతమేర రికవరీ చేస్తారు. ఫెస్టివల్ అడ్వాన్స్‌లు సైతం లేకుండా పోయాయని పోలీసులు తీవ్రఆవేదనకు గురవుతున్నారు. పోలీసులు బందోబస్తు నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇందుకుగాను ప్రతినెలా రూ.1500 టిఎ(రవాణా ఛార్జీలు) ఇస్తారు. స్పెషల్ పార్టీ సిబ్బందికైతే టిఎ కింద రూ.4,500 ఇస్తారు. దాదాపు ఏడాదికిపైగా టిఎ బిల్లులు ఇవ్వలేదు. దీంతో చేతిసొమ్ములు పెట్టుకుని దూరప్రాంత విధులకు వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో పోలీస్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఉద్యోగి జీతం నుంచి నెలనెలా జిపిఎఫ్ కింద కొంత సొమ్ము పక్కకు తీస్తారు. పిల్లల చదువులకు, పిల్లల వివాహాలకు గానీ, ఇల్లు కట్టుకున్నప్పుడు జిపిఎఫ్ సొమ్మునుండి ఉద్యోగులు రుణాలు పొందుతారు. జిపిఎఫ్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వకపోవడంతో ఖాకీల బాధ వర్ణనాతీతంగా మారింది. ఇలా పోలీస్ సిబ్బందికి అందాల్సినవి ఏ ఒక్కటీ సక్రమంగా అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. పోలీసులకు అందాల్సినవి ఏ ఒక్కటీ ఇవ్వకపోయినప్పటికీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ పోలీసులు విమర్శలను సైతం మూటగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నిరంతరం శ్రమించే పోలీసుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిబ్బందిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలీసుల సమస్యలపై యూనియన్లు సైతం సరిగా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్యాంప్ ఆఫీస్ విధుల్లో కష్టాలు

సిఎం క్యాంప్ ఆఫీసు వద్ద ప్రతినెలా జిల్లానుంచి కొంతమంది సిబ్బందిని విధులను కేటాయిస్తారు. ఈ విధులు 15 రోజులు చేయాలి. అక్కడకు వెళ్లిన సిబ్బందికి కనీస సౌకర్యాలు గానీ, ఖర్చులుగానీ ఇవ్వడంలేదని సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. వీరికి ఇచ్చే బస విధులు నిర్వహించే ప్రాంతానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రతిరోజు ప్రయాణ ఖర్చులు, భోజన ఖర్చులు భారమవుతున్నాయి. దీంతో సిఎం క్యాంప్ ఆఫీసు విధులంటే సిబ్బంది భయపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వీక్లీ ఆఫ్ సైతం అమలుకావడం లేదు. ఇలా అనేక సమస్యలతో పోలీస్ సిబ్బంది సతమతమవుతున్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని పోలీసులు కోరుతున్నారు. పోలీస్ యూనియన్లు సైతం సిబ్బంది సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన పరిస్థితి ఉందన్న చర్చ సాగుతోంది.

సిఐటియు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి
జిల్లాలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు

వచ్చేనెల 2,3,4 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక జ్యూట్‌మిల్ సెంటర్ నుండి ప్రారంభమై గాంధీ మైదానం, పెరుగు చెట్టు సెంటర్, పెద్ద పోస్టాఫీస్, గడియారపు స్తంభం సెంటర్, మెయిన్ బజార్, మున్సిపల్ ఆఫీస్, కర్ర వంతెన సెంటర్, స్టేషన్ రోడ్డు, బోసు శిబిరం, ఆర్‌ఆర్.పేట రోడ్డు, ఆర్‌ఆర్ పేట పార్కు, ప్రభుత్వాసుపత్రి మీదుగా స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే సిఐటియు రాష్ట్ర మహాసభను భీమవరంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మహాసభ ప్రారంభం రోజు వేలాది మందితో కార్మిక ప్రదర్శన, బహిరంగసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు కేరళ మున్సిపల్ శాఖ మంత్రి పి.రాజీవ్, సిఐటియు అఖిలభారత అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.హేమలత, తపన్‌సేన్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. మూడు, నాలుగు తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. ఈ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభలో చర్చించి భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలు రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాధరావు, వి.సాయిబాబు, సిఐటియు నగర నాయకులు పి.కిషోర్, జి.ఏసుబాబు, ఐలు నాయకులు కట్టా సత్యనారాయణ, ఆర్‌టిసి నాయకులు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, టికె.రావు, అరుణకుమారి, ఎల్‌ఐసి ఏజెంట్ల రాష్ట్ర నాయకులు జి.రవి కిషోర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, పవన్, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, నగరకార్యదర్శి గొడు రవీంద్రబాబు, జ్యూట్ మిల్ యూనియన్ నాయకులు జి.కోటేశ్వరరావు, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు వివిఎన్.ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్ నాయకత్వంవహించారు.


ఏలూరులో బైక్ ర్యాలీ..


నూజివీడులో..

ఆగిరిపల్లి: వచ్చేనెల 2,3,4 తేదీల్లో పశ్చిమ గోదావరిజిల్లా భీమవరంలో నిర్వహించే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల ప్రధానకార్యదర్శి ఆర్.చంటి పిలుపునిచ్చారు. మహాసభను జయప్రదం చేయాలని కుశలవ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నెక్కలం గొల్లగూడెం నుంచి ఆగిరిపల్లి వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుశలవ వర్కర్స్ యూనియన్ నాయకులు కెవికె.ప్రసాద్, ఎం.నరేష్, కార్మికులు పాల్గొన్నారు.

గణపవరం : సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జిల్లా ప్రచార జాతా బుధవారం గణపవరం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద జరిగిన సభకు యూనియన్ నాయకులు ఎం.పెంటారావు అధ్యక్షత వహించారు. ఈ సభలో జిల్లా నాయకులు ఎం.రామాంజనేయులు, కళ్యాణి, పి.గోవిందు. కె.జాన్సీ, ఎమ్‌డి.హసీనా బేగం, ఎన్.రమణరావు, ఆర్.రమణ పాల్గొన్నారు.

నూజివీడు : సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నూజివీడు పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు హనుమాన్, జి.రాజు, సిఐటియు నాయకులు చంద్రశేఖర్ మారేసు గోవిందు, ఏడుకొండలు, శ్రీను, కమల, అన్నపూర్ణ, నాగమణి, స్వాతి, రామ, విజయ, అనురాధ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు: సిఐటియు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జిల్లా ప్రచార జాతా బుధవారం నిడమర్రు చేరుకుంది. ఈ సందర్భంగా మూడు రోడ్ల జంక్షన్‌లో ప్రచార సభ జరిగింది. ఈ సభలో సిఐటియు నాయకులు నారపల్లి రమణరావు, రామాంజనేయులు. కళ్యాణి, సత్యనారాయణ, వెలగలేటి మోహన్, లావేటి చంద్రరావు, కుమారి, మైలవరపు నాగలక్ష్మి, ఎస్.లారెన్స్ కుమారి పాల్గొన్నారు.

జిల్లాలో 2.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రూ.537 కోట్ల విలువ గల 2,62,798 మెట్రిక్ టన్నుల ధాన్యం 37,133 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రూ.122 కోట్లను 12,126 మంది రైతులకు చెల్లింపు చేశామని తెలిపారు. మరో 18 వేల మంది రైతులకు సంబంధించి రూ.183 కోట్ల మొత్తాన్ని చెల్లింపు కోసం బ్యాంకులకు విడుదల చేశారన్నారు. సంబంధిత సొమ్ము రైతుల ఖాతాలకు జమ చేసే ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లాలో పారదర్శకతతో నూతన విధానంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు.

31 నుంచి పూర్తిగా ప్లాస్టిక్ కవర్ల నిషేధం
ఇన్‌ఛార్జి కమిషనర్, జెసి అరుణ్ బాబు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్‌లో సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ కవర్స్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామని ఇన్‌ఛార్జి కమిషనర్ జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వాణిజ్య సముదాయాల వ్యాపారులు, హోటల్స్, కూరగాయలు, పండ్లు, స్వీట్లు దుకాణాల యజమానులు తమ దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్స్ నిషేధించడమైననే బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్స్ వల్ల కలిగే అనార్థాలను వినియోగదారులకు వ్యాపారులు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిషేధించిన ప్లాస్టిక్ కవర్స్ వస్తువులను అమ్మిన, వినియోగించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్లాస్టిక్ రహిత నగరంగా క్లీన్ ఏలూరుగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలంతా భాగస్వాములు కావాలని కమిషనర్ పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని లక్కవరం ఎంపిపి పాఠశాల-1 ప్రధానోపాధ్యాయులు ఆర్‌ఎన్‌విఎన్.మూర్తిపై సస్పెన్షన్ వేటు పడింది. మూర్తిని సస్పెండ్ చేస్తూ డిఇఒ మధుసూదన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారని ఎంఇఒ బి.రాముడు తెలిపారు. పాఠశాలలో చేపట్టే నాడు నేడు పథకం నిర్మాణ పనులను విద్యార్థులతో చేయిస్తున్న కథనంపై అధికారులు విచారణ చేపట్టిన అనంతరం మూడు నెలలు సస్పెండ్ చేసినట్లు ఎంఇఒ బి.రాముడు తెలిపారు. నాడు నేడు పనులపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందించామని తెలిపారు.


ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - చాట్రాయి

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం టిడిపి నాయకులు ధర్నా చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు నాయకత్వంలో నిర్వహించిన ధర్నాలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే డబ్బులు జమ చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలు చేసి నెలల గడుస్తున్నా డబ్బులు జమ కావట్లేదన్నారు. ఇ క్రాప్ట్ నమోదు చేసుకున్న వారికే కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్ముకోవాలనే నిబంధన పెట్టారన్నారు. రైతులు ఇ క్రాప్ట్ చేయించినా కూడా నమోదు కాలేదని వంకలు చెబుతున్నారని, రైతులను మోసం చేస్తున్నారని చెప్పారు. ధాన్యం ఎగుమతి చేసేందుకు రవాణా నిమిత్తం తగిన లారీలను ప్రభుత్వం పంపించలేకపోతుందన్నారు. ధాన్యం నిల్వ చేసుకోవడానికి స్థలం లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ చేయాలని కోరారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావుకు వినతిపత్రం అందించారు. నూజివీడు ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ కార్యదర్శి అక్కినేని చంద్రశేఖర్, మాజీ ఎంపిపి కందుల కృష్ణ, తెలుగు రైతు మహిళా అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ, నోబుల్ రెడ్డి, వెల్ది రాజా, మందలపు జగదీష్, చల్లగుల్ల రాజారత్నం, కంచర్ల హనుమంతరావు, కోట జోషి, చాగంటి బుచ్చిబాబు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై వ్యకాస పోరాటం

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అన్నారు. మండలంలోని రామమ్మగూడెంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండురోజుల జిల్లా శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ అధ్యక్షతన వచ్చే సంవత్సర కాలంలో సంఘం చేయాల్సిన కార్యచరణ, ప్రణాలికలపై చర్చించారు. శ్రమజీవులు సమస్యలు, గ్రామాల్లో కమిటీల ఏర్పాటు, మండల కమిటీలు, ఫిబ్రవరి నెలలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న మాస్ క్లాసులు, భూ పోరాటాలు, పామాయిల్, విఎస్‌లు, పొగాకు కార్మికులు, వలస కార్మికులపై కొత్తసంఘాల ఏర్పాటు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రవి మాట్లాడుతూ గడచిన కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పామాయిల్ కార్మికుల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పదివేల మంది కార్మికుల కోసం సంఘం పని చేసిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని, ఆ పోరాటాల ఫలితంగా గెలలు కోసే సమయంలో కరెంట్ షాక్‌కు గురై చనిపోయిన కుటుంబాలకు పరిహారం అందించగలిగామని చెప్పారు. భూ సమస్యలపై కూడా జిల్లావ్యాప్తంగా సంఘం అనేక ఉద్యమాలు చేపట్టి గిరిజనులు, దళితులు, పేదలకు సాగు భూములు సాధించేలా పోరాటం చేశామని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని కూలీల సమస్యలపై సంఘం నిరంతరం పని చేస్తుందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాలమ్మ, జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం, జిల్లా సహాయ కార్యదర్శులు తుమ్మల సత్యనారాయణ, మహంకాళి, రాజమండ్రి డానియల్, మడకం సుధారాణి, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి మురళి, నాగేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు జిల్లా వ్యాప్తంగా ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలి
జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

భూ హక్కు పత్రాలు పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారి గ్రామాల్లోనే అందించడానికి నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణంలో స్టేజ్ కన్వర్షన్ చేయని మండల అధికారులపై జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబుతో కలిసి జిల్లాలోని మండల స్థాయి అధికారులతో సంక్షేమ పథకాల పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలు జరుగుతున్న పాలనాపరమైన భవనాల నిర్మాణంలో స్టేజ్ కన్వర్షన్ చేయని మండల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజులు సమయం ఇచ్చినా ఒక్క భవనం కూడా స్టేజ్ కన్వర్షన్‌లోకి రాకపోవడం ఏంటని అధికారులను నిలదీశారు. ఈ విషయంలో కొంతమంది మండల అధికారులకు షో కాజ్ నోటీసు ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జనవరి ఒకటో తేదీ నుంచి రూ.2500 నుండి రూ.2750 వృద్ధాప్య పెన్షన్లు పెంపుదల చేసిన వాటి గురించి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి వృద్ధాప్య పెన్షన్లు అందించాలని, జారీ చేసిన నోటీసులుపై విచారణ చేపట్టి 29 డిసెంబర్ సాయంత్రం కల్లా నివేదికను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ హక్కు పత్రాలు పంపిణీని వేగవంతం చేయాలన్నారు. కొన్ని మండలాల్లో పత్రాల పంపిణీలో ఆలస్యానికి గల కారణాలను సమీక్షలో చర్చించారు. వెంటనే పూర్తిస్థాయిలో పంపిణీ నిర్వహించాలని ఆదేశించారు. నాడు నేడు పథకం ద్వారా నిర్మిస్తున్న జూనియర్ కాలేజీలు, పాఠశాల భవనాల నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఇసుక, ఐరన్ వంటివాటిపై సమీక్ష చేశారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రీ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా పరిషత్ సిఇఒ రవికుమార్, విఆర్ఒ విజయరాజు, డ్వామా పీడీ రాంబాబు, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, డిపిఒ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పట్టని ప్రభుత్వం
రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వ రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చేనెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో నిర్వహించనున్న సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా బుధవారం పెన్షనర్స్ కార్యాలయం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్రఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర పెన్షనర్స్ ఎదుర్కొంటున్న అనేక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రతినెలా ఒకటో తేదీకి పెన్షన్స్ రాకపోవడంతో పెన్షనర్స్ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత పిఆర్‌సిలో ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తక్కువగా ఇస్తున్నారన్నారు. 70, 75 సంవత్సరాలకు ఇచ్చే అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ తగ్గించడం దారుణమ న్నారు. మట్టిఖర్చులు కూడా తగ్గించడమేంటని ప్రశ్నిం చారు. హెల్త్ కార్డులపై కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయకపోవడంతో మానసిక ఆందోళనకు గురవుతు న్నారని పేర్కొన్నారు. డిమాండ్ల సాధించేం దుకు ఆందోళనకు పిలుపిస్తే ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడుతోం దన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ జనవరి రెండో తేదీన జరగబోయే భారీ ర్యాలీ, బహిరంగ సభలో పెన్షనర్లు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిఎ ఎరియర్స్, పిఆర్‌సి ఎరియర్స్, పెండింగ్ మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని భీమవరం యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారి రవిప్రసాద్, సూర్యనారాయణ, భాస్కరరావు పాల్గొన్నారు.

జువైనల్ జస్టిస్ కమిషన్ సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

గిరిజన విద్యాసంస్థల్లోకి విద్యార్థి, ప్రజాసంఘాల నేతలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఎవరూ రాకూడదంటూ ఇటీవల జువైనల్ జస్టిస్ కమిషన్ ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని విద్యార్థి, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. మండలంలోని విద్యార్థి, యువజన, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్ అధ్యక్షతన సమావేశం బుధవారం జరిగింది. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యాసంస్థల్లోకి సంఘాలు, సంస్థల ప్రవేశం నిషేధం ఎత్తివేయాలని, జువైనల్ జస్టిస్ కమిషన్ సర్క్యులర్‌ను రద్దుచేయాలని, ప్రభుత్వ నియంతృత్వ ధోరణి మానుకోవాలన్నారు. ఈ ధర్నానుద్దేశించి ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, పిడిఎస్‌యు రాష్ట్ర పూర్వపు కార్యదర్శి సరియం రామ్మోహన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన విద్యాసంస్థల్లో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గిరిజన విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. తల్లిదండ్రులు నెలలో రెండో శనివారం రావాలని కమిషన్ సూచించడం తగదన్నారు. వసతి గృహాల్లో పర్మినెంట్ వార్డెన్‌లు లేరని ప్రతీ సంవత్సరం డిప్యూటేషన్ పద్ధతిలో టీచర్లే వార్డెన్ విధులను నిర్వర్తిస్తున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యం బారినపడితే తల్లిదండ్రుల వద్దకు పంపుతున్నారని, ఎఎన్‌ఎంలు ఉంటే ఆరోగ్యం చేసుకునేవారన్నారు. తక్షణం ఎఎన్‌ఎంలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యాసంస్థల్లో సిబ్బంది పూర్తిస్థాయిలో లేరన్నారు. 2018 సంవత్సరంలో అమలు చేసిన మెనూను ఇప్పటికీ విద్యార్థులకు అందిస్తున్నారని 'నాడు - నేడు 'అంటూనే గత ప్రభుత్వం ఇచ్చిన మెనూను అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థి, ప్రజాసంఘాలను రావొద్దనడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడాలనడం మానవ హక్కులకు భంగం కలిగేలా ఉన్నాయన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ ఎస్.శాంతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కారం రాఘవ, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్, పివైఎల్ డివిజన్ అధ్యక్షులు కె.పోతిరెడ్డి, తగరం బాబూరావు, ఆదివాసీ కొండరెడ్ల సంఘం నాయకులు పట్ల రమేష్ కుమార్‌రెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు రవ్వా బసవరాజు, ధర్ముల వెంకటేశ్వరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, ఎఐకెఎంఎస్ నాయకులు కాకడ కన్నారావు, జి.రమేష్‌బాబు, జి.పండు, జి.విశ్వనాధరెడ్డి పాల్గొన్నారు.

సంతృప్తికర వైద్య సేవలందించండి
రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


సిబ్బందితో మాట్లాడుతున్న కృష్ణబాబు

ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంతృప్తికర స్థాయిలో ప్రజలకు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు వైద్యాధికారులను ఆదేశించారు. ఏలూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, వైద్య శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రిలోని ఓపి కేంద్రాల నుంచి వివిధ విభాగాలు, చికిత్స వార్డులు, టాయిలెట్లను పరిశీలించారు. రోగులను కలిసి వారికి అందుతున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిని మెడికల్ కళాశాలగా మార్పు చేస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజీ మార్పు చేసే క్రమంలో ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మాణ పనులను కృష్ణబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ ఎవిఆర్.మోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ భీమేష్, ఆర్‌ఎంఒ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

యుటిఎఫ్ ఉంగుటూరు మండల శాఖ ఆధ్వర్యంలో టెన్త్ పరీక్షల స్టడీ మెటీరియల్ తెలుగు, ఇంగ్లీష్, మీడియం పుస్తకాలను పాఠశాలకు ఒక కాపీ చొప్పున తొమ్మిది పాఠశాలలకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఉసమీల రాంబాబు, ప్రధాన కార్యదర్శి దాకే జోగినాయుడు, కార్యవర్గ సభ్యులు శ్రీను, సిహెచ్.శ్రీధర్, గొల్లపల్లి రామారావు, యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందేలను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోడిపందేలను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖరరావు చెప్పారు. కోడిపందేలను నివారించే విషయంలో ఏలూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి.సోమశేఖరరావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేల నివారణకు విలేజ్ మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఆయా కమిటీల పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కోడిపందేలు, జూదాల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ప్రవీణ్, ఏలూరు నగర 1, 2, 3 టౌన్, రూరల్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్, ఆర్ఐ, గ్రామ రెవెన్యూ అధికారులు, టీం మెంబర్లుగా నియమించిన సామాజిక సేవకులు పాల్గొన్నారు.

పంచాయతీ వార్డు మెంబర్ రాజీనామా

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని సోమవరం గ్రామ పంచాయతీలోని ఐదో వార్డు మెంబర్ కలవల పుష్పవతి రాజీనామా చేశారు. తన రాజీనామాను బుధవారం ఎంపిడిఒకు అందించారు. ఎంపిడిఒ కారణం అడిగి తెలుసుకోగా 2021లో వైసిపి బలపరిచిన అభ్యర్థిగా ఐదో వార్డు మెంబర్‌గా పోటీ చేసి గెలుపొందానని, కాని అనారోగ్య పరిస్థితి కారణంగా ప్రజలకు సేవ చేయలేకపోతున్నానని, గ్రామస్తులకు అందుబాటులో ఉండలేకపోతున్నానని, వార్డు మెంబర్‌గా రాజీనామా చేసి విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే రాజీనామా చేస్తున్నానని కలవల పుష్పవతి తెలిపారు. రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారుల ఆమోదం కోసం పంపించినట్లు ఎంపిడిఒ ఎస్.మురళీమోహన్ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐబి సిఐ సాయిస్వరూప్ అన్నారు. ఎస్ఇబి ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన సమావేశంలో సిఐ సాయిస్వరూప్ మాట్లాడారు. మత్తు పదార్థాలైన గంజాయి, హెరాయిన్, కొకైన్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 14500 ఏర్పాటు చేసిందని తెలిపారు.

బలివే ఆలయానికి రూ.2.23 లక్షల హుండీ ఆదాయం

ముసునూరు : మండలంలోని బలివే గ్రామంలో ఉన్న రామలింగేశ్వర ఆలయంలో హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ ఇఒ బి.వి.శ్రీనివాసరావు, ధర్మకర్తలు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో లెక్కించగా రూ.2,23,231 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ తెలిపారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది రూ.52 వేలు అదనపు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

సంక్షేమ పాలనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీలుగుమిల్లి పంచాయతీలోని ఎస్‌సి కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నారు. పలువురు ఎంజాయ్‌మెంట్‌లు లేవని అడగగా కాలనీ ఇల్లు మంజూరైన ప్రతిఒక్కరూ ఎంజాయ్‌మెంట్‌తో సంబంధం లేకుండా ఇల్లు నిర్మించుకోవచ్చని చెప్పారు. ఇళ్లను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఎంఎల్ఎకు సమస్యలు వెల్లువ

ఎస్‌సి కాలనీలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ బాలరాజుకు సుందరయ్య కాలనీ, అంబేద్కర్ నగర్‌లో పలువురు కాలనీ వాసులు పలు సమస్యలను తెలిపారు. వీధి లైట్లు, డ్రెయినేజ్ రోడ్లు సరిగ్గా లేవని తెలపగా ఎంఎల్ఎ స్పందించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంతరావు, వైస్ ఎంపిపి సోమగని శ్రీనివాసరావు, ఉప సర్పంచి బొంతు రవితేజ, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సర్పంచి జగదాంబ, సొసైటీ అధ్యక్షుడు బోధ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కైకలూరులో అన్నదానం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా తాలూకా సెంటర్‌లో పలువురు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా భోజనాలు పెట్టారు. మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పేరిచర్ల ప్రసాదరాజు పుట్టినరోజు సందర్భంగా ఆర్థిక సహకారంతో అన్నా క్యాంటీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, పట్టణ అధ్యక్షులు ఎండి జానీ, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

డివైడర్‌ను ఢీకొన్న బైక్

ఇంటర్ విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బైక్ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. మరొక విద్యార్థి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 27వ తేదీ రాత్రి పట్టణానికి చెందిన నీలి సంజయ్‌వర్మ (17) పుట్టినరోజును స్నేహితులతో కలిసి సంతోషంగా జరుపుకున్నారు. పుట్టినరోజు హాజరైన మరో ఇంటర్ విద్యార్థి కావేటి నాగదుర్గాసాయిసుభాష్, సంజయ్ వర్మ కలిసి మరో స్నేహితుడిని బస్టాండ్‌లో దింపడానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. బస్టాండ్ నుంచి వస్తుండగా మార్గంమధ్యలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కావేటి నాగ దుర్గా సాయి సుభాష్ (17) అక్కడికక్కడే మృతి చెందగా, గాయాలపాలైన నీలిసంజయ్ వర్మను స్థానికులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రి వైద్యులు ఏలూరుకు సిఫారసు చేశారు. మృతుని తల్లి కావేటి అరుణకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణంలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తూ దాడులు చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులను రోడ్డుపైకి పంపించేందుకు భయపడుతున్నారు. ఈ పిచ్చికుక్కల దాడిలో బుధవారం మరో పది మందికిపైగా గాయాలపాలయ్యారు. మంగళవారం ముస్లింపేటలో ముగ్గురిపై దాడి చేశాయి. గాయాలపాలైన వారు చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొందుతున్నారు.

తీరని అన్నదాతల వెతలు

ధాన్యం విక్రయించేందుకు అవస్థలు

తేమశాతం పేరుతో ఇబ్బందులు



ఆర్‌బికెలో తేమశాతం చూస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో అన్నదాతల పరిస్థితి ఎలా ఉన్నా ముదినేపల్లి మండలంలో మాత్రం ఇంకాను అవస్థలు పడుతునే ఉన్నారు. వారి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. తాము పండించిన ధాన్యం విక్రయించుకునేందుకు గతంలో ఎన్నడూ ఈ విధమైన ఇబ్బందులు పడలేదంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను విక్రయించుకునేందుకు ఇన్ని బాధలు పడాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం వల్ల తాము నరకం అనుభవిస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఈ ఇబ్బందులు పడేకన్నా వ్యవసాయం మానివేయడమే మేలు అని తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ ధాన్యం ఎగుమతి చేసిన దగ్గర నుంచి దిగుమతి అయ్యే వరకు చుక్కలు చూస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. ఆర్‌బికె మిషన్‌లో తేమశాతం 16 చూపిస్తే, మిల్లరు దగ్గర ఉన్న మిషన్‌లో 20 శాతం చూపెడుతోందంటున్నారు. ఇదేమింటూ మిల్లర్‌ను రైతులు ప్రశ్నిస్తే అంతే మీకు ఇష్టమైతే దించండి.. లేకుంటే ధాన్యం వెనక్కి తీసుకుపోండి అంటూ మిల్లర్లు లెక్కలేనితనంగా మాట్లాడుతున్నారంటూ రైతులు వాపోతున్నారు. ఇంకా మాట్లాడితే ఒక్కో పాయింట్ రూ.రూ.40, రూ.50 చెల్లించాలని మిల్లర్లు భయపెడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో చేసేదిలేక మిల్లర్ చెప్పినట్లుగా పాయింట్లకు డబ్బు ఎదురు కట్టి ధాన్యం దిగుమతులు చేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. మండలంలో ఈసారి దాళ్వా లేకపోవడమే రైతుకు మేలు అయిందని, లేకుంటే మళ్లీ ఈ నరకం చూడాల్సి వచ్చేదంటూ రైతులు చెబుతున్నారు. తేమశాతం పేరుతో మిల్లర్లు దోచుకుతింటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

మిల్లులో నరకం చూస్తున్నాం


కె.కోటయ్య, కౌలు రైతు, పేరూరు



కౌలు చేసి నానా నరకం అనుభవిస్తున్నాం. మిల్లులోకి వెళ్లిన తర్వాత నానా ఇక్కట్లు పడుతున్నాం. మిల్లుకు 20 టన్నుల ధాన్యం తీసుకువెళ్లా తేమశాతం పేరుతో మిల్లర్‌కు రూ.25 వేలు కట్టాల్సి వచ్చింది. జేబులో డబ్బులు లేవు, డబ్బు కట్టకపోతే ధాన్యం వెనక్కి తీసుకుపో అన్నాడు. మళ్లీ ఇంటికి వచ్చి డబ్బులు తీసుకొని వెళ్లి కడితే ధాన్యం దిగుమతి చేసుకున్నాడు. గతంలో దళారీ రూపాయి తిన్నా రైతుకు ఆ రోజున కష్టం లేకుండా ఉంది. అప్పుడు తేమశాతం ఉన్నా దళారీ రైతుకు ఇచ్చే డబ్బుల్లో మినహాయించి ఇచ్చేవాడు. ఇప్పుడు రైతు ఎదురు డబ్బులు కడితే గాని మిల్లర్ ధాన్యం దిగుమతి చేసుకోవడంలేదు.

దగ్గర మిల్లులోనే ధాన్యం దిగుమతి చేసుకోవాలి

జి.వెంకటేశ్వరరావు, రైతు, చినపాలపర్రు



మండల పరిధిలో ఉన్న రైసుమిల్లుల్లోనే ధాన్యం దిగుమతి చేసుకోవాలి. అలా కాకుండా కైకలూరు, బంటుమిల్లి, ఏలూరు అంటున్నారు. రైతుకు దగ్గర ఉన్న రైసు మిల్లుకు ధాన్యం దిగుమతి చేసుకునేలా రైతుకు అవకాశం ఇవ్వాలి. ఆర్‌బికెలో శాతం లేదు, మిల్లర్ దగ్గర చూస్తే 20 శాతం తేమ చూపెడుతోంది. తేమశాతం పేరుతో రైతు ఎదురు మిల్లర్‌కు డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి దగ్గర రైస్ మిల్లుల్లోనే రైతులు ధాన్యం అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలి .

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి అమలు చేస్తున్న విద్యావ్యవస్థలోని మార్పులను అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. మండల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, ఒక అంబేద్కర్ గురుకులం పాఠశాలలకు చెందిన 868 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ బుధవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా గుండుగొలను, భీమడోలు, పూళ్ల ఉన్నత పాఠశాలలు వేదికలుగా నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గుండుగొలనులో గ్రామ ఉపసర్పంచి ముదిండి సూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు పోటీ పరీక్షలకు హాజరు కావడం తప్పనిసరిగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలు ఆంగ్ల మాధ్యమంతో అధునీకరించిన విద్యా విధానానికి అనుగుణంగా కొనసాగుతున్నందువల్ల విద్యార్థులు కొంత మేరకు ఇబ్బంది పడుతున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారానికి అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఆంగ్ల మాధ్యమంతో ప్రీ స్కూల్ పేర కార్యక్రమాల నిర్వహణ చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల విద్యాధికారి సాంబశివరావు, ఎంపిపి కె.రామయ్య, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా, ఎఎంసి చైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, ఎంపిపి కె.రామయ్య, గుండుగొలను సొసైటీ అధ్యక్షులు వివివి.భాస్కర్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



భీమడోలులో ట్యాబ్‌లు అందిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

చింతలపూడి : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నాడు నేడు ద్వారా రూ.1.30 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, చంద్రు నాగేశ్వరరావు, నీరజ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు రూ.30 వేల విలువైన ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో పిల్లలకు పెడుతున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.శ్రీనివాస్, తహశీల్దార్ జి.ఎలీషా, ఎంపిడిఒ మంగతాయారు, ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, బోధ శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సర్పంచి చిర్రి జగదాంబ, ఉప సర్పంచి బి.రవితేజ, బూరుగు ప్రేమ్‌కుమార్, రామచంద్రం, శ్రీను పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : మండలంలోని తామరకొల్లులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, గ్రామ సర్పంచి బత్రాజు శివాజీ ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి చిట్టేటి కేశవరాజు, విద్యా కమిటీ ఛైర్మన్ నున్న నాగబాబు పాల్గొన్నారు.

కోవిడ్ సన్నద్ధతపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి - ఏలూరు

కోవిడ్ సన్నద్ధతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలతో బుధవారం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఒకవేళ కోవిడ్ రోగులు పెద్ద ఎత్తున ఆస్పత్రులకు పోటెత్తితే కోవిడ్ కేసులు విజృంభిస్తే అందుకు తగ్గట్లు అన్ని జిల్లాల ఆసుపత్రుల్లో ఆరోగ్య సౌకర్యాలు, పడకలు, సిబ్బంది లభ్యత, మౌలిక సదుపాయాలు సహా వాటి సంసిద్ధతను అంచనా వేసేందుకు మాక్ డ్రిల్ నిర్వహించడం ముఖ్య ఉద్దేశమని డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎవిఆర్.మోహన్ చెప్పారు. ఐసోలేషన్ పడకలు, ఆక్సిజన్, ఐసియు, వెంటిలేటర్ వ్యవస్థలు ఉన్న పడకలు ఎన్ని ఉన్నాయి.. ఎంతమందికి సదుపాయం కల్పించగలం, వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఫ్రంట్ లైన్ వర్కర్లు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్ల అందుబాటు వంటిపైనా మాక్ డ్రిల్ చేశారు. డిసిహెచ్ఎస్ ఎవిఆర్.మోహన్, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావు ఆసుపత్రిని సందర్శించి మాక్ డ్రిల్ సమీక్షించారు. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలోని వివిధ వార్డులు, ల్యాబ్, ఐసియు, ఆక్సిజన్ ప్లాంట్ పరిశీలించారు.

ఘనంగా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, టిడిపి నియోజకవర్గ సీనియర్ నేత, రావిచర్ల గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రావిచర్ల గ్రామంలోని చర్చిలో ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహించి, గొల్లపల్లి గ్రామంలో ఉన్న రఘునాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయనకు పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

అభిమానులంతా కోలాహలంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించేందుకు ఘనమైన ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ తన బాధ్యత ఏమాత్రం విస్మరించకుండా రైతు పోరాటంలో భాగస్వామ్యం వహించి రైతుల పక్షాన కాపా శ్రీనివాసరావు గళమెత్తి పోరుబాట పట్టారు. చాట్రాయి గ్రామంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతన్నలకు మద్దతుగా కాపా శ్రీనివాసరావు పోరాటం నిర్వహించారు. రావిచర్ల గ్రామంలో నాయకులు, అభిమానులు కార్యకర్తల ఆనందోత్సాహాల నడుమ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అభిమానులకు విందు ఏర్పాటు చేశారు.

షట్టర్ మెకానిజం ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు జలవనరుల అధికారులు స్పందించి మండలంలోని న్యూగురజ ఛానల్ డిపికి కొత్త షట్టర్ మెకానిజం ఏర్పాటు చేశారు. పోల్‌రాజ్ కెనాల్ కి.మీ. 66.661 వద్ద కుడి పక్కన ఉన్న న్యూ గురజ ఛానల్ స్లూయిస్ ద్వారా గురజ ఆయుకట్టు రైతులకు సాగునీరు సరఫరా చేయడం జరుగుతుంది. గత నాలుగు నెలులుగా ఛానల్ డైరెక్టు పైపునకు ఉన్న షట్టర్ శిథిలావస్థకు చేరింది. దీంతో అధికారులు ఛానల్‌కు తాత్కాలిక అడ్డుకట్టను ఏర్పాటు చేశారు. ఈ నెల 12వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు న్యూ గురజ స్లూయిస్ తాత్కాలిక అడ్డుకట్టను తెరిచి పోల్‌రాజ్ కెనాల్ నుంచి నీటిని చేపల చెరువులకు తరలించారు. దీంతో ఛానల్ వెంబడి కోసి పనలపై ఉన్న వరిపంట చేల్లోకి నీరు చేరి పనలు నీట ముగిగాయి. దీంతో వరి, ఆక్వా రైతులు తమ చేపల చెరువులకు నీటిని అక్రమంగా తీసుకుపోవడం ద్వారా తమ పంటచేల్లోని పనలు మునిగిపోయి తమ పంటకు నష్టం వాటిల్లిందని, నష్ట పరిహారం ఇవ్వాలంటూ జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రజాశక్తిలో ఈనెల 13వ తేదీన నీట మునిగిన వరిచేలు - ఆందోళనలో రైతులు శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఎట్టకేలకు గురజ న్యూఛానల్ డైరెక్టు పైపునకు షట్టర్ మెకానిజం ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ముదినేపల్లి పోల్‌రాజ్ కెనాల్ సెక్షన్ ఎఇఇ వికెవి.కిషోర్ పర్యవేక్షించారు.



షట్టర్ మెకానిజం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని శ్రీరామవరంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది గర్భిణులకు, 40 మంది అనారోగ్య బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్, పాఠశాలలో విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వాతావరణం చలిగా ఉండడం వల్ల జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్యాలు ప్రబలుతున్నాయని, ప్రజలు చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని మంచుకు దూరంగా ఉండాలని సూచించారు. ఇతర ఇబ్బందులు ఉంటే స్థానిక ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జి.రాజ్యలక్ష్మి, ఎఎన్ఎం జ్యోతి, ఆశావర్కర్లు 104 సిబ్బంది పాల్గొన్నారు.




వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్‌ను కట్ చేసి వేడుకల్ని ప్రారంభించారు. దేశానికి స్వాతంత్ర్య తెచ్చి అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.చంద్రశేఖర్ ,లంకా.రామ్మోహన్, గౌడ రంగబాబు, చంద్రకాంతమ్మ, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.సాయిమురళీ, కొమ్మన సాంబశివరావు, వైవి.మల్లేశ్వరరావు, సేవాదళ్ సుబ్బారావు పాల్గొన్నారు.

పొలాల మధ్య డంపింగ్ యార్డు వద్దని ఆందోళన



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - దెందులూరు

పొలాల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే సహించేది లేదని పలువురు రైతులు, దళితులు ఆందోళన వ్యక్తం చేయటంతో అధికారులు వెనుదిరిగారు. దెందులూరు, సత్యనారాయణపురం, కొమిరేపల్లి సీతంపేట గ్రామాల్లో పోగేసిన చెత్తను సేకరించి కొమిరేపల్లి గ్రామానికి చెందిన ఒక నిరుపేద రైతుకు చెందిన భూమిలో డంపింగ్ చేయటానికి దెందులూరు కార్యదర్శి జోసెఫ్ తదితర అధికారులు వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, రైతులు, దళితులు ఆయా గ్రామాల నుంచి కాశీపుంతకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

సబ్ పోస్ట్‌మాస్టర్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక సబ్ పోస్టాఫీస్‌లో సబ్ పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న కందుల సురేష్ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. బుట్టాయగూడెం పోస్టాఫీస్‌లో కొన్నినెలల క్రితమే పోస్ట్‌మాస్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సురేష్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్‌గా ఉద్యోగోన్నతి పొంది బదిలీ లయ్యారు. సురేష్‌ను బుధవారం సబ్ పోస్టాఫీస్ పరిధిలోని బ్రాంచ్ పోస్టాఫీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ అమీర్ బాషా అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ఇప్పటివరకు సహకరించిన తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ చింతపల్లి వెంకటేశ్వరరావు, పలువురు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పుట్లగట్లగూడెం గ్రామంలోని విభిన్న ప్రతిభావంతుడు గుబ్బం మనోహర్ వైద్య ఖర్చులకు సాయం అందిస్తామని మిషన్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు సొంగ రోషన్ కుమార్ తెలిపారు. బుధవారం గుబ్బం మనోహర్ కుటుంబ దీన స్థితిపై స్పందించిన ఆయన ఆర్థిక సాయం అందించారు. సొంగ రోషన్ కుమార్ మాట్లాడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం నెలకు రూ.రెండు వేల చొప్పున సంవత్సరానికి రూ.24 వేలు వారి కుటుంబానికి అందిస్తానని తెలిపారు. మానవతా దృక్పథంతో సాయం అందించిన రోషన్‌కుమార్‌కి మనోహర్, తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, ఎంపిటిసి రాంబాబు, దొప్పశని పండు, మూలకాల కొండయ్య, బాదరాల వీరబాబు, గుర్రం అంజిబాబు పాల్గొన్నారు.

పిట్టాస్ ఛారిటీస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణం డం డం గార్డెన్స్‌లో పిట్టాస్ చారిటీస్ ఆధ్వర్యంలో బుధవారం వంద పాస్టర్స్ కుటుంబాలకు నూతన వస్త్రాలు, బైబిల్, న్యూట్రిషన్ ఫుడ్, నగదు బహుమతులు న్యూ ఇయర్ గిఫ్ట్‌గా అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ న్యూ ఇయర్ గిఫ్ట్ ముందుగా అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. కరోనా సమయంలో వంద కుటుంబాలకు నిత్యవసర సరుకులు, కూరగాయలు, న్యూట్రిషన్ ఫుడ్, మెడిసిన్స్ అందించారని చెప్పారు. వృద్ధులకు చేతి కర్రలు, పేద మహిళలకు కుట్టు మిషన్లు, వస్త్రాలను పంపిణీ చేశారన్నారు. పిట్టాస్ ఛారిటీస్ నిర్వాహకులు పిట్టా కుమార్ మాట్లాడుతూ క్రిస్టియన్ దాస్ వారి పేరిట ఈ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పేద కుటుంబాల్లో సైతం నూతన సంవత్సర వెలుగులో నిండాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లుగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిఎ విద్యాసంస్థల రిటైర్డ్ ప్రిన్సిపల్ పివి.ప్రసాద్, దైవజనులు దేవదానం, వై.మెతుషిల్లా పాల్గొన్నారు.

తామరకొల్లులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

మండలంలోని తామరకొల్లులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ పాల్గొని ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెంటే పార్థసారథి, వెంకట నరసమ్మ, పోతురాజు, జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, గంగుల శ్రీదేవి, యేసురాజు, గుర్రాజు, విజయలక్ష్మి, పూల రాజీ పాల్గొన్నారు.